క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ


పూజలు చేస్తున్న శివప్రసాద్‌స్వామి

గొలుగొండ : ఏఎల్‌పురంలో గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భారీ అయ్యప్ప అంబలం పూజలకు వందలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. అరకు మాజీ ఎంపీ గొట్టేటి మాధవి, భర్త శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలను గొలుగొండ మండలం, అల్లూరి జిల్లా రాజవొమ్మంగి, కొయ్యూరు, చింతపల్లి మండలాల నుంచి అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. శివప్రసాద్, మాధవి దంపతులతో కాకినాడ వేణు గురుస్వామి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు.

పథకాలపై కనీస అవగాహన అవసరం


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శైలజ

నాతవరం : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులు కనీస అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాధికారి శైలజ అన్నారు. మండలంలో గన్నవరం గ్రామంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి చేనులో దోమకాటు ఉందని, దానిని నివారణ కోసం గ్రామాల్లో రైతులకు సస్య రక్షణ చర్యలు వివరించడం జరుగుతుందన్నారు.

సివిల్ సప్లయి డీటీగా కుమార్


సివిల్ సప్లయి డీటీగా కుమార్


నాతవరం : సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు, ఆయన అనకాపల్లి జిల్లా కేంద్రంలో పని చేస్తుండగా ఇక్కడకు బదిలీ చేయడంతో విధుల్లోకి చేరారు. మర్యాద పూర్వకంగా తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌ను కలిశారు. అనంతరం రేషన్ షాపుల డీలర్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇంతవరకు ఇంచార్జి సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా చంద్రలేఖ పని చేసేవారు.

గవరపాలెంలో రెవెన్యూ గ్రామసభ


గవరపాలెంలో అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్

కె.కోటపాడు : గవరపాలెం గ్రామంలో సోమవారం రీసర్వే గ్రామసభను నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ పాల్గొన్న ఈ సభలో 37 మంది అర్జీలను అందించారు. అర్జీదారులకు ముందస్తు సమాచారం రెవెన్యూ సిబ్బంది అందించడంతో పాటు క్షేత్ర స్థాయిలో సమస్యను గుర్తించనున్నట్లు డీటీ తెలిపారు. అర్జీలకు 15 రోజుల కాల వ్యవధిలోగా పరిష్కారం చూపే దిశగా చర్యలను తీసుకుంటామన్నారు. మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ తోట భవాని, ఎంపీటీసీ అచ్చిబాబు పాల్గొన్నారు.

తూటిపాలలో జాతీయ విద్యా దినోత్సవం


ఉపాధ్యాయుడు లోవరాజుకు సత్కారం

మాకవరపాలెం: తూటిపాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నేపథ్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లోవరాజును సత్కరించారు.

మూలకు చేరిన కియోస్క్‌లు

- ఆర్‌బీకేల నిర్వహణ గాలికి వదిలేసిన ప్రభుత్వం
- రూ.లక్ష విలువ చేసే యంత్రాలు నిరుపయోగం


నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

నర్సీపట్నం : పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను రైతులే నేరుగా కొనుగోలు చేసుకునేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో కొనుగోలుతో పాటు రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు మార్కెటింగ్ విధానం అందుబాటులో ఉండేది. దీనికోసం కియోస్క్‌లు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. ప్రభుత్వ నిర్లక్షత కారణంగా అధికారులు రైతు భరోసా కేంద్రాల నిర్వహణను గాలికి వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో పంటల వివరాలు, మద్దతు ధర ఎక్కడ అధిక ధర పలుకుతోంది.. ఎక్కడ తక్కువ ధరలు ఉన్నాయనే విషయాలను రైతులు స్వయంగా తెలుసుకునేందుకు కియోస్క్‌లు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కియోస్క్‌లను గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రైతులు ఎరువులకు సైతంగా ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.


పెద్దబొడ్డేపల్లి మార్కెట్

రైతుల ప్రయోజనాలు గాలికి..

కియోస్క్‌ల వినియోగాన్ని సిబ్బంది నిర్లక్ష్యం చేశారు. నెలల తరబడి వీటిని వినియోగించకపోవడంతో కొన్నిచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. మరి కొన్ని చోట్ల ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. నర్సీపట్నం వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లో నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల, గొలుగొండ మండలాల్లో 92 కేంద్రాల్లో 92 యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి కొనుగోలుకు ఒక్కో యంత్రానికి రూ.67 వేల చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం అవన్నీ మూలకు చేరడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. రైతులు మండల కేంద్రాల్లో ఉంటే వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కియోస్క్‌ల్లో బుక్ చేసుకుంటే అవసరమైన ఎరువులు, మందులు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలకు చేరేవి. అక్కడ నుంచి రైతులు తీసుకుని వెళ్లే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రైవేటు వ్యాపారుల నుంచి ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు.

గతంలోనే బాగుండేది...



రైతుల భరోసా కేంద్రాల్లోనే అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందిస్తే బాగుంటుంది. గతంలో నేరుగా రైతు భరోసా కేంద్రానికి వెళ్లి కియోస్క్‌లో బుకింగ్ చేసుకుంటే రైతులకు నేరుగా విత్తనాలు, ఎరువులు, మందులు వచ్చేవి. ప్రస్తుతం కియోస్క్‌ల నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో మళ్లీ రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది.

–లాలం అప్పారావు, రైతు, నర్సీపట్నం

కియోస్క్‌లు వినియోగంలో లేవు



సబ్ డివిజన్ పరిధిలోని అన్ని చోట్ల కియోస్క్ యంత్రాలు పనిచేస్తున్నాయి. కియోస్క్‌లో వినియోగించే యాప్‌లు సెల్‌ఫోన్‌లోనే అందుబాటులోకి రావడంతో ఎక్కువ మంది సెల్‌ఫోన్ యాప్‌లపైనే ఆధారపడుతున్నారు. దీంతో కియోస్క్‌లు పెద్దగా వినియోగంలో లేవు.

–టి.శ్రీదేవి, ఏడీఏ, నర్సీపట్నం

సోలార్ పంపులపై రైతులకు కేంద్రం ఆర్థిక సాయం


కొండెంపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట : కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పీఎం కుసుం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం కేవీకేలో పలు గ్రామాల రైతులకు పీఎం కుసుం పథకం గురించి వివరించారు. రైతులు తమ పొలాల్లో సోలార్ పంపులు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. సోలార్ పంపుల వల్ల రైతులు కరెంట్ గురించి ఎదురు చూడకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకూ మోటార్లు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీఎం కుసుం టీం సభ్యుడు భాను శ్యాం, శాస్త్రవేత్తలు సత్తిబాబు, కిషోర్, బాలు, ప్రదీప్, సౌజన్య పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్‌కు ఈకేవైసీ నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : మండల వ్యాప్తంగా దీపం పథకం ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్లు పొందిన లబ్ధిదారులంతా ఉచిత గ్యాస్ పొందడానికి తమ రికార్డులు సక్రమంగా ఉన్నవీ లేనివి సరి చూసుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందాలంటే తమ ఆధార్ కార్డు నంబరు తమ బ్యాంకు అకౌంటుకు లింకు అయి ఉండాలన్నారు. అలాగే ప్రతి లబ్ధిదారుడు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పథకం మొదటి విడత వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ఉంటుందన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు.

డ్వాక్రా మహిళలు అక్షరాస్యులు కావాలి


శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పారావు, ఎంఈవో పాండురంగారావు

మాడుగుల : మహిళా విద్య కుటుంబానికే వెలుగును నింపుతుందని, గ్రామాల్లో డ్వాక్రా సంఘాలతో సహా మహిళలంతా అక్షరాస్యులుగా మారాలని ప్రభుత్వం ఉల్లాస్ పథకం ప్రవేశపెట్టిందని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అప్పలనర్సమ్మ ఆధ్వర్యంలో వీవోఏలుతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎంఈవో పాండు రంగారావు మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యతతోపాటు గృహ హింస, వరకట్న వివాహాలపై ప్రతి మహిళకు అవగాహన పెంచాలన్నారు.

దేవరాపల్లి: పాదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే అవకాశాన్ని వెలుగు వీవోఏలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు వీవోఏలకు సోమవారం నిర్వహించిన ఉల్లాస్ శిక్షణలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా సంఘాల్లోని 18 ఏళ్ల వయసు దాటి 50 ఏళ్ల లోపు నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాస్యత, ప్రాథమిక విద్య, ఆర్థిక, సాంకేతిక విద్య పై అవగాహన కల్పించడమే ఉల్లాస్ కార్యక్రమం ధ్యేయమన్నారు.

ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి


ఆర్డీవో రమణకు సమస్య చెప్పుకుంటున్న పాఠశాలల శానిటైజేషన్ వర్కర్స్, వాచ్‌మేన్‌లు

నర్సీపట్నం : ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ మండలస్థాయి అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నాలుగు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే జీతాలు మంజూరు చేయాలని ప్రభుత్వ పాఠశాల నైట్ వాచ్‌మెన్, శానిటైజేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టి.చిన్నబాబు, ప్రెసిడెంట్ బొర్రా చంటిబాబు, కార్యదర్శి ఎస్.అలేఖ్య, కోశాధికారి బి.లావణ్య ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ వర్కర్లు ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధి బొంతువీధికి వెళ్లే మెయిన్ రోడ్డు వీరబ్రహ్మంస్వామి ఆలయం నుంచి షిరిడీ సాయిబాబా ఆలయం వరకూ రోడ్డుకు ఇరువైపులా చేపలు, మాంసం, కూరగాయలు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని విశ్రాంత ఉద్యోగి గౌరినాయుడు ఫిర్యాదు చేశారు.

60 పశువులకు వైద్య పరీక్షలు, చూడి తనిఖీలు


వేచలంలో పశు పోషణపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి భానుబాబు

దేవరాపల్లి : వేచలంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల శిబిరానికి విశేష స్పందన లభించింది. నోడల్ అధికారి డా.పి.భానుబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పశువైద్యాధికారి డా. సౌజన్య, మామిడిపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక, ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషరాణి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 31 పశువులకు గర్భకోశ చికిత్సలు, 16 ఎదకు రాని పశువులకు చూడి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 21 మంది పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, మందులు అందజేశారు.

14న సీపీఎం ప్రజా పోరు ఆందోళన


చోడవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

చోడవరం: పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలంటూ ఈనెల 14వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజాపోరు ఆందోళనకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరుతూ సీపీఎం, సిఐటీయూ, నాయకులంతా కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నిత్యవసర వస్తువుల ధరలు చాలా ఘోరంగా పెరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ పట్టించుకోలేదని, ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచి వసూలు చేస్తున్నారని, వీటిపై ఈనెల 14న ప్రజా పోరు పేరుతో ఆందోళన చేపట్టినట్టు జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు చెప్పారు. ఈ ప్రజాపోరు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రజలను చైతన్యపరిచేందుకు కరపత్రాల పంపిణీ విస్తృతంగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గూనూరు వరలక్ష్మి, మండల నాయకుడు ఎస్.వి. నాయుడు, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు

ఎక్సైజ్ సీఐ సురేష్ కుమార్



నర్సీపట్నం : నిబంధనలు అతిక్రమిస్తే మద్యం షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 21 మద్యం షాపులకు అనుమతులు ఇచ్చామని, 18 షాపులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల మూడు షాపులు ప్రారంభం కాలేదన్నారు. ఎమ్మార్పీకి మించి ఒక్క రూపాయి అదనంగా తీసుకున్నా లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే దుకాణాల్లో విక్రయాలు జరపాలని అన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఐదుగురుపై కేసులు పెట్టామన్నారు. వీరి వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టుకు ఏ మద్యం షాపు నుంచి అయినా మద్యం సరఫరా చేస్తే మొదటిసారి రూ.5 లక్షల వరకు జరిమానా వేస్తామన్నారు. రెండవ సారి పట్టుబడితే షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

నీటి సంఘాల జాబితా విడుదల


తహసీల్దార్ రమాదేవి

మాడుగుల : సాగు నీటి సంఘాలు జాబితా విడుదల చేసినట్లు తహసీల్దార్ కె.రమా దేవి విలేకరులకు తెలిపారు. తెన్నేటి విశ్వనాథం(పెద్దేరు) ప్రాజెక్టుకు సంబంధించి 7 మీడియం ఇరిగేషన్ సంఘాలు, వేచలం పాలవెల్లి (కోనాం) జలాశయానికి సంబంధించి ఒక మీడియం సంఘానికి, మరో 14 మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాలకు ఓటరుల జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. వీటిలో అభ్యంతరాలుంటే రెండు రోజుల్లో తెలియజేయాలన్నారు.

మాడుగుల రూరల్ : నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. తారకరామ జలాశయం పరిధిలో గల ఎం.కోడూరు సాగునీటి సంఘం ఎన్నికకు ఓటర్ల జాబితాను వీఆర్‌ఓలు ఎర్రయ్య, జగదీశ్వరి, గ్రామ సచివాలయం వద్ద విడుదల చేశారు.

18న సచివాలయాల వద్ద ఆందోళన


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కె.కోటపాడు : చంద్రబాబు పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేముళ్లు అన్నారు. ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా కార్యక్రమం సంబంధించి కరపత్రాలను సోమవారం రామచంద్రపురంలో ఆయన విడుదల చేశారు. ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 18న గ్రామాల్లో సచివాలయాల వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపడతామన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ రేపు

రోలుగుంట : మండల జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ఈ నెల 13 న అభివృద్ధి ప్రణాళికలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

నర్సీపట్నం : నీలంపేట గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెట్టుపల్లి పశువైద్యాధికారి పుష్ప తెలిపారు. శిబిరంలో పశు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

నేడు సత్యనారాయణ వ్రతాలు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం ఉత్తరవాహిని నదీ తీరంలో గత శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరుగుతున్నాయని ఆలయ పురోహితులు భద్రచల రామం తెలిపారు.

విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ

మాడుగుల రూరల్ : కె.జె.పురం శివాలయం ఆరుబయట నూతనంగా ప్రతిష్ఠించే శివ పార్వతుల, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం భూమి పూజ చేశారు. దాతల సహకారంతో శివ పార్వతుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమానికి సోమవారం ఉదయం శాస్త్రోకంగా భూమి పూజ చేశారు. స్థానిక గురు స్వామి మద్దాల రమణ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. శివపార్వతుల విగ్రహ నిర్మాణాలకు దాతలు సహకరించాలని గురుస్వామి మద్దాల రమణ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు నిలిపివేతకు వినతి


వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దేవరాపల్లి: పల్లపు ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ వరి పంట కోతలు ప్రారంభం కావడంతో కోతలు పూర్తయ్యే వరకు ఉపాధి హామీ పనులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. ఎంపీడీవో సువర్ణరాజు, ఉపాధి హామీ ఏపీవో డి.చంద్రకళకు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి సోమవారం వారు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధి హామీ పనులు చేపడితే వరి పంట కోతలకు కూలీలు దొరికే పరిస్థితి ఉండదని తెలిపారు.

అయ్యప్ప భక్తుల శరణుఘోష


అరటిజోర్లుతో అలంకరించిన మండపం

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్ప అంబలం పూజా కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. గ్రామానికి చెందిన గంగుమళ్ల రమణ, పైడిరాజుల ఆధ్వర్యంలో గురుస్వామి దీవి అప్పలకొండ(దత్తు) పర్యవేక్షణలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప, వినాయకుడు, కుమారస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు అరటి డొప్పలతో ప్రత్యేకంగా గుళ్ల నిర్మాణం చేపట్టి పూజలు చేశారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

విద్యార్థులకు హితవు పలికిన డీఎస్పీ మోహన్


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ మోహన్


మాట్లాడుతున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు

నర్సీపట్నం : మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ మోహన్ విద్యార్థులకు హితవు పలికారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసుశాఖ చేపట్టిన సంకల్పం ప్రోగ్రాంలో భాగంగా సోమవారం శివపురంలోని గాయత్రి, మదర్ థెరిసా ఒకేషనల్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు రవాణా, వినియోగం వంటి చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ జి.గోవిందరావు, ఎస్‌ఐలు రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఇంచార్జి ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంతో అనారోగ్య సమస్యలతో పాటు కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

రోలుగుంట: మాదక ద్రవ్యాల మత్తులో యవత పడొద్దు, బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు హితవు పలికారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ రామకృష్ణారావు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్‌ఐలు రామారావు, తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణదేవి పేట ఎస్‌ఐ తారకేశ్వరరావు ఏఎల్‌పురంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. గొలుగొండ ఎస్‌ఐ రామారావు గురుకుల కళాశాలలో విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

మాడుగుల రూరల్ : మాదక ద్రవ్యాల వినియోగం అనర్థాలపై వి.మాడుగుల డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ నారాయణరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు తప్పవన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై బుచ్చెయ్యపేట ఎస్‌ఐ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాకు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


వడ్డాది శివాలయంలో భక్తుల రద్దీ


పెద్దచెరువు శివాలయంలో నందీశ్వరుడికి పూజలు


ఉమామహేశ్వర స్వామికి అభిషేకం


ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో


వి.బి.అగ్రహారంలో పురాతన శివలింగానికి పూజలు


వామలింగేశ్వరస్వామి ఆలయంలో

బుచ్చెయ్యపేట : కార్తీక మాసం రెండో సోమవారం పలు గ్రామాల్లో శివాలయాలు భక్తుల రద్దీతో నిండిపోయింది. బుచ్చెయ్యపేట, వడ్డాది, సీతయ్యపేట, దిబ్బిడి, విజయరామరాజుపేట, రాజాం, బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం, గున్నెంపూడి, పెదమదీన, గంటికొర్లాం, ఫంగిడి తదితర గ్రామాల్లో శివాలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. పలువురు భక్తులు పాలాభిషేకాలు, కుంకుమ పూజలు, ప్రత్యేక భజనలు చేశారు.

నర్సీపట్నం : బలిఘట్టం ఉత్తరవాహినిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీబ్రహ్మలింగేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక, అభిషేకాలు జరిపించుకున్నారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్తరవాహినిలో వేంచేసిన పాకలపాడు గురుదేవులను భక్తులు దర్శించుకున్నారు.

దేవరాపల్లి: కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని తిమిరాం ఉమామహేశ్వరీ స్వామి ఆలయం, దేవరాపల్లి వనదేవీశ్వర, ఉమామహేశ్వరీ దేవి, బోయిలకింతాడ, పెదనందిపల్లి, చిననందిపల్లి, ఎం.అలమండ, వేచలం గ్రామాల్లో శివాలయాల్లో పూజలు, అభిషేకాలు జరిగాయి.

నాతవరం: మండలంలో వి.బి.అగ్రహారం గ్రామంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో 750 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన పురాతన శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. చమ్మచింత, జిల్లేడుపూడి, మర్రిపాలెం తదితర శివాలయాల్లో పూజలు చేశారు.

చోడవరం : స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ఆలయ అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, చలపతి ప్రత్యేక పూజలు చేశారు. మూడు నదులు కలిసే ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ శారదానదిలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించారు.

కె.కోటపాడు : స్థానిక భీమలింగేశ్వరాలయం, ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయం, చౌడువాడలో గల కాశీవిశ్వేశ్వర ఆలయం, లంకవానిపాలెంలోగృహలింగేశ్వరాలయాలను భక్తులు పెద్ద ఎత్తున సందర్శించి పూజలు చేశారు.

మాడుగుల రూరల్ : మండలంలోని కె.జె.పురం, వీరవల్లి అగ్రహారం, జంపెన, వీరనారాయణం, పిట్టగెడ్డ, వీజేపురం, ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, ధ్వజస్తంభాల వద్ద దీపార్చన జరిగింది.

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వర, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వర, గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చీడికాడ : మండలంలోని తురువోలు, చీడికాడ, యల్.బి.పట్నం, ఖండివరం, తదితర గ్రామాల్లో శివాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.